




కర్నూలు (కల్చరల్), జనవరి 14:
జిల్లాలో సంక్రాంతి ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. ఆదివారం 'భోగి' వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. పల్లెల్లో భోగి వేడుక సందడి బాగా కనిపించింది. పాత సామగ్రిని, పాత వస్తువులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. పాతకు స్వస్తి చెప్పి, భోగి మంటల వెలుగుల్లో కొత్త క్రాంతికి స్వాగతం పలికారు. హారతులు ఇచ్చి, నైవేద్యాలు సమర్పించారు. భోగి భస్మాన్ని నుదుట ధరించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా నువ్వులతో చేసిన సజ్జ రొట్టెలు ప్రసాదంగా స్వీకరించారు. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు సిద్ధమయ్యారు. గ్రామ సీమల్లో ఇంటికి చేరిన కొత్త ధాన్యంతో చేసిన పిండి వంటలతో రైతులు వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకోనున్నారు. కనుమ పండుగ రోజున పశువులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేయనున్నారు. పలు చోట్ల గోదా రంగనాథ స్వామి కల్యాణం నిర్వహించారు.





మానవ జీవన క్రాంతి



వాసవీ నగర్‌లో గోదా రంగనాథ స్వామి కల్యాణం



వేడుకల్లో పాల్గొన్న భక్తులు



భోగి మంటలు వేస్తున్న టీడీపీ నాయకులు



ఆదోని: నారాయణపురంలో బండలాగుడు పోటీలు



- ఆనందోత్సాహాల మధ్య భోగి వేడుకలు
- నేడు సంక్రాంతి.. రేపు కనుమ
- జిల్లాలో సంక్రాంతి సంబరాల సందడి



ప్రకృతి అందించిన వేడుక...సంక్రాంతి

ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటి చెబుతూ ఈ వేడుక హేమంత రుతువులో వేతెంచుతుంది. సంక్రాంతి పర్వది నాల్లో రైతుల ఇండ్లలో ధాన్యం రాశులు చేరి, వారి బతుకంతా కాంతిమయం చేస్తుంది. అందరి కళ్లలో ఆనందాన్ని నిలుపుతుంది. నేలపై రంగవల్లికలు, నింగిపై గాలిపటాలు భువికీ దివికీ హరివిల్లు ద్వారాలను ఏర్పరచుతాయి. డూడూ బసవన్న అంటూ గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలు, జంగమదేవర నినాదాలు హృద్యంగా మనసును మీటుతుంటాయి. అటు పితృదేవతలను స్మరించుకోవడం, చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసి వారు చిరంజీవులుగా బాగుండాలని కోరుకోవడం, ఏడాదిపాటు తమకు సేవ చేసి, పాడిపంటలను అందించే పశువులకు కృతజ్ఞతా పూర్వకంగా సేవచేయడం ఈ సంక్రాంతి సమయాన అనువైనవిగా పెద్దలు నిర్ణయించారు.

ముందున్నవన్నీ మంచి రోజులే...



సూర్యుడు సంక్రాంతి నుంచి ఉత్తరాయన ప్రయాణం ఆరంభిస్తాడు. 'ఇక ముందున్నవన్నీ మంచి రోజులే' అని పెద్దలు అనే నానుడిలో ఒక అర్థం కనిపిస్తుంది. ఏడాదిలో దక్షిణాయనం కొనసాగిన ఆరునెలలు పగలు తక్కువగా ఉంటుంది. రాత్రి ఎక్కువ సమయం ఉండటంతోపాటూ చలిగాలులు, క్రిమి, కీటకాల బెడద ఉంటాయి. అయితే సూర్యుడు సంక్రాంతి రోజున 'మకర రాశి'లోకి ప్రవేశించింది మొదలు ఉత్తరాయన పుణ్యకాలం మొదలవుతుంది. ఈ కాలంలో పెళ్లిళ్లు, పేరంటాళ్లు, గృహ ప్రవేశాలు ఇతరత్రా శుభకార్యాలు చేసుకోవడానికి వీలవుతుంది. అన్ని పండుగలూ తిధుల ప్రకారం, తేదీ మార్పులతో వస్తుంటాయి. కానీ సంక్రాంతి ప్రతి ఏడాది జనవరి 14 లేదా 15 తేదీల్లోనే కచ్చితంగా ఉంటుంది. మకర సంక్రాంతితో ఉత్తరాయనం మొదలవుతుంది.

మకర సంక్రాంతి అంటే...?

నెల రోజులపాటు కొనసాగిన ధనుర్మాసం ముగింపును గుర్తు చేస్తూ మకర సంక్రాంతి వస్తుంది. ప్రకృతిలోని సూర్యుడు దక్షిణార్థ గోళం నుంచి ఉత్తరార్థ గోళం వైపు పయనిస్తూ మకర రాశిలో ప్రవేశించడాన్నే మకర సంక్రాంతిగా వేడుక నిర్వహిస్తున్నారు. సంక్రాంతి అంటే సంక్రమణం అని అర్థం. అంటే చేరుకోవడం, మారడం అని పేర్కొంటారు. ఉత్తరాయణ పుణ్యకాలమైన సంక్రాంతి రోజున చేసే ఏ దానమైనా శ్రేష్ఠమైందిగా శాస్త్రం చెబుతుంది. అందుకే ఈ రోజున నువ్వులు, దుంపలు, ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, గోవులు దానం చేస్తే స్వర్గవాసం కలుగుతుందదని పెద్దలు పేర్కొంటారు. అందుకే పల్లెల్లో గంగిరెద్దు ఆటగాళ్లు, జంగమదేవరలు, హరిదాసులు ఈ వేడుక రోజున ప్రత్యక్షమై, తమ హావభావ విన్యాసాలతో అలరించి, రైతులు ఇచ్చే వాటిని స్వీకరిస్తారు. రైతులు చెటోడ్చి పండించిన పంటలు చేతికొచ్చిన సమయం కనుక ఇది రైతుల పండుగ అయింది. అందుకే సంక్రాంతి రోజున రైతుల ఇండ్లన్నీ బంధువులు, కుటుంబ సభ్యులతో కళకళలాడుతుంటాయి. సంక్రాంతి పండుగ రోజున కొత్త ధాన్యంతో పొంగలి చేస్తారు. అలాగే వివిధ రకాల పిండి వంటలు ప్రత్యేకంగా తయారు చేస్తారు. సంప్రదాయ రుచులను ఆస్వాదిస్తారు.

పశు సంపదను గుర్తు చేసేదే 'కనుమ పండుగ'

రైతులు తమ వ్యవసాయ పనులకు ఏడాదంతా ఆసరాగా నిలిచి ఉండే పశువుల కోసం 'కనుమ' పండుగ ఘనంగా నిర్వహిస్తారు. తమ ఇండ్లలోని గోవులు, బర్రెలు, ఎద్దులకు ఆరోజున శుభ్రంగా స్నానం చేయించి, పసుపు, కుంకుమలతో వాటిని అందంగా ముస్తాబు చేస్తారు. పశు సంపదను మరింత అభివృద్ధి చేయాలని, తమ వ్యవసాయ పనులకు మరింత అండగా నిలవాలని వాటిని పూజిస్తారు. ఆరోజున ఎడ్లను అందంగా ముస్తాబు చేసి, గ్రామంలో తిప్పుతారు. ఎండ్లబండ్ల పందేలు, కోడి పందేలు, గాలిపటాల పందేలు నిర్వహిస్తారు.

రావణ వాహనంపై శివపార్వతులు

- నేడు పార్వతీ కళ్యాణం
- స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ



శ్రీశైలం, జనవరి 14: శ్రీశైలం మహా క్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు రావణ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. లోక కళ్యాణం కోసం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్రపారాయణలు, చతుర్వేద పారాయణలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రావణ వాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఆలయ వెలుపలకు ఉత్సవానికి తోడ్కొని వచ్చి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, ఢమరుక నాదాలు, చెంచుల నృత్యాల సందడి భక్తులను ఆకట్టుకుంది. గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించి తరించారు. సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు నిర్వహించారు. కార్యక్ర మంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

● నేడు స్వామి అమ్మవార్లకు నంది వాహన సేవ

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం సాయంత్రం నంది వాహన సేవలో భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అలాగే సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం విశేషంగా నిర్వహించనున్నారు. సంక్రాంతి బ్రహ్మోత్సవ కల్యాణానికి చెంచు భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది.

పస్తులతో ఉపాధి కూలీలు

- పండుగ లేని పేద బతుకులు
- రెండు నెలలుగా అందని కూలి డబ్బులు
- ఉమ్మడి జిల్లాలో రూ.20 కోట్లు పెండింగ్

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 14: ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 80వేల మంది ఉపాధి కూలీలు రెండు నెలలుగా కూలి డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. కనీసం సంక్రాంతికైనా కూలి డబ్బులు ఇస్తే.. పండుగ చేసుకుందామనే అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే ఇస్తామని అధికారులు చెబుతున్నారు. పస్తులతో పండుగను నెట్టుకరావాల్సిందే అని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు.



ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 3 లక్షల మందికి జాబ్ కార్డులు ఉపాధి హామీ పథకం పనుల కోసం ఇచ్చారు. ప్రస్తుతం రెండు జిల్లాల్లో 80 వేల మంది దాకా పనులు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.12 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.8 కోట్ల దాకా ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వాల్సి ఉంది డ్వామా అధికారులు చెబుతున్నారు.

పండుగ పూట పస్తులు పెడుతారా...? సంక్రాంతి పండుగను గ్రామాల్లో ఎంతో సంబరంగా చేసుకుంటారు. గత వారం రోజుల నుంచి ఉపాధి పనులు చేస్తున్న కూలీలు కూలీ డబ్బుల కోసం ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. వారం పని చేస్తే ఆ మరుసటి రోజు వేతనాలు మీ ఖాతాల్లో జమ అవుతాయని అధికారులు చెప్పడం తప్ప అమలు కావడం లేదు. ఈ దిశగా ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడమే కారణం. రెండు నెలలుగా చేసిన పనులకు డబ్బులు ఇవ్వకుండా పండగ పూట ఇబ్బంది పెట్టడం ఏమిటని ఉపాధి కూలీలు ఆందోళన చెందుతున్నారు. పనులు చేసే చోట కూలీల వివరాలను డ్వామా ఫీల్డ్ స్టాఫ్, మండల కార్యాలయానికి పంపిస్తారు. వారు చేసిన పనులను బట్టి ప్రతి సోమవారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని అధికారులు చెబుతారు. అయితే- ప్రభుత్వం కూలి డబ్బులను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం చూపుతోందని కూలీలు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు.

ప్రభుత్వం నుంచి నిధులు రాగానే చెల్లిస్తాం

కర్నూలు జిల్లాలో రూ.12 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.8 కోట్లు మొత్తం రూ.20 కోట్ల దాకా ఉపాధి పనులు చేసిన కూలీలకు చెల్లించాల్సి ఉంది. రెండు నెలల నుంచి ప్రభుత్వం నుంచి ఈ పథకానికి నిధులు రాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తాం.

- అమర్నాథ్ రెడ్డి, డ్వామా పీడీ

వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తా

- 2012 నుంచి జగన్‌తోనే నడిచాం..
- మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ బహిరంగ ప్రకటన

పత్తికొండ, జనవరి 14 : రాబోయే ఎన్నికలలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తున్నా అని మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి కూతురు, పత్తికొండ మాజీ ఎంపీపీ ఎస్. నాగరత్నమ్మ అన్నారు. ఆదివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ఓదార్పు యాత్రలో నియోజకవర్గంలో ఆయన వెంట నడిచామని, 2012 నుంచి ఏ పదవీ ఆశించకుండా పార్టీలో ఉన్నామని అన్నారు. 2014లో కోట్ల హరిచక్రపాణిరెడ్డి కోసం, 2019లో ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీదేవి గెలుపు కోసం పని చేశామన్నారు. పత్తికొండలో పార్టీ కోసం పనిచేసిన తన కుటుంబానికి ఈసారి ఎమ్మెల్యే టికెట్ కావాలని కోరారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యే బరిలో నిలుస్తామని ఆమె ప్రకటించారు.



నాయకులు, కార్యకర్తలతో నాగరత్నమ్మ దంపతులు

జగన్ దుష్ట పాలన పోవాలి

- బాబు నవశకానికి నాంది
- భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం
- టీడీపీ కార్యాలయం ఎదుట నాయకుల నిరసన



భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కర్నూలు(అర్బన్), జనవరి 14: జగన్ దుష్ట పాలనకు స్వస్తి పలికి, బాబు నవశకానికి నాంది పలకాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట జగన్ ఇటీవల విడుదల చేసిన జీవో ప్రతులను దహనం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పీజీ నరసింహులు యాదవులతో కలిసి ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులకు కార్యకర్తలకు, అభిమానులకు జిల్లా తెలుగుదేశం పార్టీ నుంచి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఏ సామాజిక వర్గం ప్రజలు కూడా సుఖంగా లేరని, సామాన్య ప్రజల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారిందని అన్నారు. అనునిత్యం పెరుగుతున్న నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యులు కనీసం పండుగ కూడా చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వైసీపీ విధ్వంసక పాలనలో అన్ని వర్గాలపై పన్నుల భారం మోపి రాష్ట్రాన్ని అప్పుల ప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు. అందువల్లే జగన్ అప్రజాస్వామిక చర్యలకు, నిరంకుశ పాలనకు స్వస్తి పలకాలని భోగి మంటల్లో ఆయన పాలనకు సంబంధించిన పత్రాలను దహనం చేశామని అన్నారు. 2024లో నవశకానికి నాంది పలకాలని, చంద్రబాబు స్వర్ణయుగం వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంది మధుసూదన్ నాయుడు, సత్రం రామక్రిష్ణుడు, కాకరవాడ చిన్న, డి జేమ్స్, పి. హనుమంతరాయచౌదరీ, శివశంకర్ నాయుడు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ కీడు పోవాలని భోగి మంటలు

- వివిధ జీవో ప్రతులను దహనం చేసిన టీడీపీ నాయకులు
- బాబు నవశకానికి నాంది పలకాలని పిలుపు



జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న గౌరు దంపతులు



కలెక్టరేట్ ముందు భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

కల్లూరు, జనవరి 14: రాష్ట్ర ప్రజలకు పట్టిన వైసీపీ కీడు తొలగిపోయి, చంద్రబాబు ఆధ్వర్యంలో నవశకం ఆరంభం కావాలని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం స్థానిక మాధవీనగర్‌లోని గౌరు నివాసంలో నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ శ్రేణులతో కలిసి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రజలను మోసగించి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రతులను భోగి మంటల్లో గౌరు దంపతులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, జిల్లా కోశాధికారి పీయూ మాదన్న, జిల్లా కార్యదర్శి కేతూరు మధు, పాణ్యం మైనార్టీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటలతో నిరసన

కర్నూలు(కలెక్టరేట్)/ (ఎడ్యుకేషన్) :పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, డీఎస్సీ ప్రకటించాలని, 12వ పీఆర్సీ అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల, విద్యార్థి సంఘాలు ఆదివారం కలెక్టరేట్ కార్యాలయం ముందు భోగిమంటల్లో వివిధ జీవోల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వారు పేర్కొన్నారు. 12వ పీఆర్సీ ఫిట్మెంట్ చేసేలోపు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ విషయంలో వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెల మొదటి పని రోజున జీతం ఇవ్వాలని కోరారు. ఇందులో ఏపీజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..

డీఎస్సీ నోటిఫికేషన్‌పై తప్పుడు ప్రకటనలు చేస్తూ నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తుందని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆదివారం వివిధ జీవో ప్రతులను భోగిమంటల్లో కాల్చివేసి నిరసన తెలియజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర అధ్యక్షుడు బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం

కర్నూలు(హాస్పిటల్): భోగి మంటల్లో ఎస్మా ప్రతులు దహనం చేసి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీ వర్కర్లు భోగి పండుగ కూడా చేసుకోకుండా సమ్మెలో పాల్గొన్నారు. భోగి పండుగ సందర్భంగా తెల్లవారుజామున 5 గంటలకే దీక్ష శిబిరం వద్ద రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలను ఏర్పాటు చేసి ఆ మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, నాయకులు సుధాకరప్ప, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఏ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు మహ్మద్ రఫీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విజయభారతి, మహేశ్వరి, విజయలక్ష్మి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.





భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదలాలి

నంద్యాల (నూనెపల్లె): వైసీపీ పాలనతో రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని పారదోలాలని నంద్యాలలో టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శి, కౌన్సిలర్ దూదేకుల జైనాబీ, బీసీ సాధికార కమిటీ విభాగాల రాష్ట్ర, జిల్లా నాయకులు కలిసి ఆదివారం టీడీపీ కార్యాలయం ఆవరణలో భోగి సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టారు. వైసీపీ కీడు తొలగి ఏపీ వెలగాలని నినాదంతో భోగి మంటలు వేశారు.



నంద్యాలలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో...

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



లోకేష్ (ఫైల్)

మద్దికెర, జనవరి 14: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన మొలగవల్లి లోకేష్ (25) ఆదివారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన శివరాముడు, శ్రీదేవి దంపతులది వ్యవసాయ కుటుంబం. లోకేష్ డిగ్రీ పూర్తి చేసి సైన్యంలో చేరేందుకు ప్రయత్నాలు చేశాడు. అలాగే గవర్నమెంట్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఉద్యోగం రాకపోవడంతో కర్నూలులోని ప్రైవేట్ ఫ్యాక్టరీలో చేరాడు. ఎన్నేళ్లయినా ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో లోకేష్ తన గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. మిత్రులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. చెట్టంత కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రుల రోదన అందరినీ కదలించింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దేవనకొండ, జనవరి 14 : సంక్రాంతి పండుగ వేళ ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. చిరంజీవి గౌడ్ (23) తన మిత్రుడు బాలకృష్ణతో కలిసి హైదరాబాద్ నుండి సొంతూరు బంటుపల్లికి బైక్‌పైన వస్తుండగా కర్నూలు-బళ్లారి రహదారిపై వీరంపల్లి స్టేజీ వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిరంజీవి గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరు హైదరాబాద్‌లో పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఓబులేసు, కిష్టమ్మ దంపతులకు చిరంజీవి ఒక్కడే కుమారుడు. అతని మరణంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ఓర్వకల్లు, జనవరి 14: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని కొమరోలు గ్రామానికి చెందిన కౌలు రైతు గిరిగారి శ్రీనివాసరెడ్డి (53) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ రాజారెడ్డి వివరాల మేరకు.. కొమరోలు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి ఎనిమిది ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పంటలు పండించేవాడు. ఐదేళ్లుగా వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడులు చేతికి రాలేదు. దీంతో పెట్టుబడుల కోసం చేసిన రూ.9 లక్షల అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య ఇందిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు నగరానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 14: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా విక్టర్ ప్రసాద్ సోమవారం నగరానికి రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అనంతపురం నుంచి బయలుదేరి సాయంత్రం నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం నంద్యాల జిల్లాకు వెళ్తున్నట్లు సమాచారం.

కన్నుల పండువగా గోదాదేవి కళ్యాణం



అహోబిలంలో గోదాదేవికి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జనవరి 14: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం ప్రహ్లాదవరదస్వామి, గోదాదేవి అమ్మవారికి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి గోదాదేవికి అభిషేకం నిర్వహించిన అనంతరం, దిగువలో ప్రహ్లాదవరదస్వామి, గోదాదేవి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు.

నేడు ప్రధాని జన్‌మన్ ముఖాముఖి

- గిరిజనులతో చర్చించనున్న మోదీ



పాఠశాల సిబ్బందికి సూచనలు అందిస్తున్న మోటో మేనేజరు

పాణ్యం, జనవరి 14 : గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి జన్‌మన్ ముఖాముఖి కార్యక్రమం బలపనూరు పరిధిలోని గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ డాక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీ మోటో మేనేజరు ఆర్‌జె కచప్, నంద్యాల జిల్లా డీటీడబ్ల్యూఓ వెంకటశివప్రసాద్, ఈఈ లత పాఠశాలలో ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు పరిశీలించారు. పాఠశాల సిబ్బందికి పలు సూచనలు అందించారు. ప్రత్యక్ష ప్రసారానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ ప్రదీప్, మేనేజరు గుండాల్ నాయక్, ప్రిన్సిపాల్ మేరీసలోమి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో ప్రారంభమైన స్వచ్ఛ తీర్థ



స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో చైర్మన్, ఈవో

శ్రీశైలం, జనవరి 14: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్రపరిధిలో విస్తృత పారిశుధ్య చర్యలు చేపట్టామని ఈ నెల 21 వరకు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చైర్మన్, ఈవో క్యూకాంప్లెక్స్, తదితర పరిసరాలు శుభ్రం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ హెచ్.జి వెంకటేష్, పారిశుధ్యపు సహాయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరెడ్డి, ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ రావు

శ్రీశైలం, జనవరి 14: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జడ్జిఇ వేదపండితులు ఆశీర్వదించారు.

బైకుల దొంగ అరెస్టు

మంత్రాలయం, జనవరి 14: మోటారు సైకిళ్ల దొంగను అరెస్టు చేసినట్లు మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు. కర్ణాటకలోని రాయచూరు జిల్లా మఠమారి గ్రామానికి చెందిన ముల్లా మైనుద్దీన్ పార్కింగ్ చేసిన బైకులను అపహరిస్తున్నాడని తెలిపారు. మాధవరం చెక్‌పోస్టు వద్ద వాహనాలు పోలీసులు తనిఖీ చేస్తుండగా మైనుద్దీన్ పట్టుబడ్డాడని, అతని వద్ద నున్న మూడు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు



శ్రీమఠం మధ్వమార్గ్ కారిడారులో భక్తులు రద్దీగా ఉన్న దృశ్యం

మంత్రాలయం, జనవరి 14: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. ఆదివారం సంక్రాంతి భోగి సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారాయి. భక్తులు రథోత్సవాలలో పాల్గొని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

ఈక్రాప్ నమోదును వేగవంతం చేస్తున్నాం

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 14: ప్రస్తుత రబీ సీజన్‌లో కర్నూలు జిల్లాలో రైతులు సాగు చేసిన పంటలను ఈక్రాప్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేశామని, తుది జాబితాను మార్చి నెల 5లోపు ప్రకటించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించినట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు. ప్రస్తుత రబీలో నూరు శాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన ఈక్రాప్‌లో ప్రత్యేకంగా నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారన్నారు. పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం పొందేందుకు ఈకేవైసీతో పాటు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయించాలన్నారు. 2024-25 ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తెస్తామని జేడీ వరలక్ష్మి తెలిపారు.

ఆలయాల్లో కోట్ల పూజలు



లక్ష్మీమాధవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కోట్ల

కోడుమూరు(రూరల్), జనవరి 14: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ముందుగా వెంక టగిరి గిడ్డాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోరంట్ల లక్ష్మీమాధవస్వామి, లద్దగిరి రామదాసుస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. కోట్ల వెంట టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిరుమలనాయుడు, మాజీ సర్పంచ్‌లు దుబ్బన్న, పరమేశ్వర నాయుడు, కున్నూరు మధు, గిడ్డయ్య, వెంకటరెడ్డి, వెంకటగిరి నారాయణ పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

కర్నూలు(అర్బన్), జనవరి 14: జిల్లా ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులకు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో పండుగ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం




స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న జీయర్ స్వామీజీ, వాసవీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

కర్నూలు(కల్చరల్) జనవరి14: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నగర శివారు మామిదాలపాడులోగల శ్రీగోదా రంగనాథస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ఆగమ పండితులు రమేశ్ బట్టార్, కిరణ్ బట్టార్‌ల బృందం కల్యాణ క్రతువును చేపట్టారు. ఈ సందర్భంగా జీయర్ స్వామీజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ధనుర్మాసం ఆరంభం నుంచి ఆచరించే ధనుర్మాస వ్రతం వల్ల ఎన్నో గొప్ప ఫలితాలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ప్రయాగరాజ్ నుంచి విచ్చేసిన రాఘవ ప్రసన్న జీయర్ స్వామీ జీతోపాటు జిల్లా న్యాయమూర్తి నేరెళ్ల శ్రీనివాసులు, గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పాల్గొన్నారు.

● బళ్లారి రోడ్డులోని వాసవీ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదారంగనాథ స్వామివార్ల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు ఎలిశెట్టి భద్రయ్య కుటుంబ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ఆసూరి సునీల్‌కుమార్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ వేడుకలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల భరతమాత ఆలయంలో ఆదివారం గోదారంగనాథస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. ధార్మికవేత్త పుల్లారెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ వేడుకల్లో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సందడి మహేశ్, సహ కోశాధికారి గూడా సుబ్రహ్మణ్యం, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయంలో గోదాదేవి మాధవస్వామి కల్యాణం నిర్వహించారు. ధనుర్మాసంలో భాగంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి కల్యాణకట్టపై చేర్చారు. వేదపండితుడు వందవాసి రాధాకృష్ణ అధ్వర్యంలో మంత్రాలు పఠిస్తూ శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించడానికి భక్తులు తరలివచ్చారు.



గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయంలో..

బాల సాయిబాబా సేవలు చిరస్మరణీయం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



ప్రసంగిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), జనవరి 14: బాలసాయిబాబా కర్నూలు నగర ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం పాతనగరంలోని బాలసాయిబాబా ఆశ్రమం శ్రీనిలయంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలసాయిబాబా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ బాలసాయిబాబా భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన సేవా కార్యక్రమాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెప్పారు. బాల సాయిబాబా సేవలను, సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న కార్యక్రమాలపై మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, మదనగోపాల్, నగర మేయర్ బీవై రామయ్య, వీహెచ్‌పీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, గోరంట్ల రమణ, బాల సాయిబాబా సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ టి.రామారావు, ఉషశ్రీ కొనియాడారు. ఈ సందర్భంగా పేదలకులకు ట్రైసైకిళ్లు, ఇస్త్రీ పెట్టెలు, కుట్టు మిషన్లు, పిండి రుబ్బే గ్రైండర్లు పంపిణీ చేశారు. అంతకు ముందు శ్రీనిలయంలోని బాబా విగ్రహం వద్ద అభిషేకం, శ్రీచక్రార్చన, భజనలు నిర్వహించారు. దీనజన సేవా కార్యక్ర మంలో భాగంగా ఓమ్ని, ఆర్క, అమ్మ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్, ఈసీజీ, బోన్ డెన్సిటీ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

వైసీపీని తరిమికొడదాం

కోడుమూరు(రూరల్), జనవరి 14: రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగిస్తున్న వైసీపీని తరిమికొడదామని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని పులకుర్తి గ్రామంలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ శారదమ్మ, సర్పంచ్ జయమ్మ యువనేత త్రివేద్‌కుమార్ అధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు బొగ్గుల దస్తగిరి, సురేష్, పట్టె క్రిష్ణ మాట్లాడుతూ మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామగ్రామాన వైసీపీ దుర్మార్గ పాలనను వివరిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో అభివృద్ధి లేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో సీఎం జగన్ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. నిత్యావసరాలు, బస్సు చార్జీలు, విద్యుత్ చార్జీలు పెంచి పేదల నడ్డివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, రాముడు, చెన్నరాయుడు, గడ్డమయ్య, ఉరుకుందు, నాగేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

సి.బెళగల్: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పార్టీ నాయకుడు దస్తగిరి అన్నారు. ఆదివారం మాజీ మండల కన్వీనర్ డాక్టర్ చిన్న తిమ్మప్ప అధ్వర్యంలో గొల్లలదొడ్డి గ్రామంలో మూడు రోజుల క్రితం టీడీపీ కార్యకర్తలు జగన్, శేఖర్ గృహాలను అధికారులు కూల గొట్టారన్న విషయం తెలుసుకుని వారి గృహాలను పరిశీలించారు. అలాగే మండలంలోని గొల్లల దొడ్డి, సిబెళగల్, బురాన్‌దొడ్డి, పోలకల్లు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను అందజేశారు. టీడీపీ సర్పంచులు మాదమ్మ, రామాంజనేయులు, కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, నాయకులు ధనుంజయుడు, భీమన్న, మాణిక్యం, ఇజ్రాయేలు, గూడూరు మం డల మాజీ ఎంపీపీ మహెశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దండగేరిలో ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ కురువ పరమేష్

కర్నూలు(న్యూసిటీ), జనవరి 14: నగర పాలక సంస్థ పరిధిలోని 8వ వార్డు దండగేరిలో స్థానిక టీడీపీ కార్పొరేటర్ కురువ పరమేష్ అధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గెలుపొందిన మొదటి, రెండో, మూడో విజేతలకు రూ.3000, రూ.2000, రూ.1000 బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న 85 మందికి ప్రోత్సాహక బహుమతులను కార్పొరేటర్ పరమేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో దాగిఉన్న సజనాత్మకతను వెలికితీసేందుకే ఈ పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో శేషఫణి, రమేష్, కస్తూరి వెంకటేశ్వర్లు, మంజు, లక్ష్మీనారాయణ, అభిలాష్ పాల్గొన్నారు.

'రాయలసీమ అవధానులకు పుట్టినిల్లు'

కర్నూలు(కల్చరల్), జనవరి 14: రాయలసీమ అవధానులకు పుట్టినిల్లు అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆముదాల మురళితో అష్టావధానం నిర్వహించారు. కర్నూలుకు చెందిన కవులు అవధానం సుధాకర శర్మ, డాక్టర్ కె. చంద్రమౌళిని, దండెబోయిన పార్వతీదేవి, మధుసూదన శర్మ, మహ్మద్‌మియా, సునీత, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: ఎస్టీయూ

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 14: ఎస్టీయూ వజ్రోత్సవాల స్ఫూర్తితో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న అన్నారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో విజయోత్సవ సభ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జరి గింది. ఈసందర్భంగా హెచ్.తిమ్మన్న మాట్లాడుతూ వజ్రోత్స వాలను విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఎస్టీయూ నాయకులు రామ్మోహన్ రెడ్డి, సి.నాగరాజు, వీరచంద్రయాదవ్, పాలయ్య పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నం సంక్రాంతి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 14: తెలుగువారి పండుగ సంక్రాంతిని ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవాలని కర్నూలు హార్ట్ అండ్ ఫౌండేషన్ సొసైటీ కార్యదర్శి కార్డియాలజిస్టు డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం తెల్లవారు జామున కర్నూలు హెల్త్ క్లబ్‌లో భోగి మంటలు వేసి ఆయన సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. హార్ట్ ఫౌండేషన్ సొసైటీ జాయింట్ సెక్రటరీ డా.వసంతకుమార్, కోశా ధికారి కేసీ రాముడు, లక్ష్మన్న, సభ్యులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కర్నూలు, జనవరి 14: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్‌నగర్‌కు చెందిన మధుసిరి(29) తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం అర్ధరాత్రి తర్వాత ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా.. ఆదివారం ఉదయం బంధువులు గుర్తించారు. పోలీసులకు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ



జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 14: స్థానిక మౌర్యఇన్‌లో ఈనెల 24న నిర్వహించే జాబ్ మేళా పోస్టర్‌ను టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కంపెనీలో వేలాది మందికి ఉపాధి కల్పించామని, అయినప్పటికి ఉద్యోగం కావాలంటూ తన వద్దకు రోజుకు 10 మంది దాకా దరఖాస్తులు ఇస్తున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని 18 కంపెనీలతో మాట్లాడి ఈనెల 24న మౌర్యఇన్‌లో జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగ రాజు యదవ్, హెచ్‌డీ ఆర్‌యూల్ సభ్యులు శివ, జానార్దన్, రాజశేఖర్, ఈశ్వర్, శ్రీను, రమేష్, మధు, సాయి పాల్గొన్నారు.

చీకటి జీవోలతో పాలన అస్తవ్యస్తం



భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 14: రాష్ట్రంలో చీకటి జీవోలతో పాలన గాడి తప్పిందని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని మామిదాలపాడు 38,39,40 క్లస్టర్ ఇంచార్జీ వై. రామేశ్వరరెడ్డి, ఐటి ప్రొఫెషనల్ వింగ్ పార్లమెంట్ అధ్యక్షుడు నవీన్ చౌదరి ఆధ్వర్యంలో జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రవేశపెట్టిన చీకటి జీవోలు, అక్రమ కేసుల ఎఫ్ఐఆర్ ప్రతులు, భూమి హక్కుల చట్టాల జోవో ప్రతులను భోగి మంటల్లో వేశామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శివ శంకర్ నాయుడు, సత్రం రామకృష్ణుడు, పద్మ, సుంకులమ్మ, సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు దహనం

గూడూరు జనవరి 14: తమ సమస్యల పరిష్కారం కోసం గూడూరులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారానికి 34వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను అంగన్‌వాడీలు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి బాబు, డివిజన్ కార్యదర్శి జె మోహన్ మాట్లాడారు.

మోకాళ్లపై క్లాప్ ఆటో డ్రైవర్ల నిరసన

కర్నూలు(న్యూసిటీ), జనవరి 14: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు చేపట్టిన సమ్మె ఆదివారానికి 29వ రోజుకి చేరింది. కార్పొరేషన్ ఎదుట మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్ మాట్లాడుతూ ఇన్ని రోజు లుగా కార్మికులు సమ్మె చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నగర నాయకులు కుమార్, రఘుశేఖర్, ఇస్మాయిల్, నవీన్, బాబ్జి పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 14: జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్ దేశాయ్ విమర్శించారు. సీఐటీయూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో ఆదివా రం సంక్రాంతిని పురస్కరించుకుని జొహరాపురంలోని మైదానంలో క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. ఈపోటీలు సీఐటీయూ నాయకులు దాసు, తిప్పన్న అధ్యక్షతన జరిగాయి. నాయకులు మౌలాలి, మధుప్రసాద్, చందు, మద్దిలేటి పాల్గొన్నారు.

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఘనంగా గోదాదేవి కల్యాణం

ఆదోని టౌన్, జనవరి 14: స్థానిక నగరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి ఉత్సవ మూర్తులను ఆలయంలో ఊరేగించారు. ఆలయ అధ్యక్షుడు వీటీ ప్రకాష్, కార్యదర్శి వేణుగోపాల్, టీజీ రాంప్రసాద్, మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతి, త్రివేణి పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథస్వామి దేవాలయంలో గోదాదేవి రంగనాథస్వామివార్ల కల్యాణం వైభవంగా జరిగింది. ఆదివారం భోగిని పురస్కరించుకుని ఉదయం ఆలయం ప్రాంగణంలో భోగి మంటలను వేశారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణాన్ని నిర్వహించారు.

వైభవంగా గోపుర కలశ ప్రతిష్ఠ

మంత్రాలయం, జనవరి 14: మండలంలోని రాంపురంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోపుర కలిశకు పూజలు చేసి మంగళవాయిద్యాల మధ్య గోపుర కలిశ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పాటిల్ లలితమ్మ, టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, భీమా యూత్ నాయకులు ధరణీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషే కాలు, హారతులు ఇచ్చారు.

ఎడ్లబండ్ల లాగుడు పోటీలు

ఆదోని, జనవరి 14: ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎద్దుల బండ్ల గిరక పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామ పెద్దల సహకారంతో ఈ పోటీలు జరిగాయి. ప్రథమ విజేతగా బర్మారెడ్డి ఎద్దులు 2,961 అడుగుల గిరక లాగి 10 తులాల వెండి, ద్వితీయ విజేతగా రాజారెడ్డి ఎద్దులు 2,250 అడుగుల గిరక లాగి 5 తులాల వెండిని దక్కించుకున్నాయి



నిరసన మంటలు

» వైసీపీ పీడ తొలగిపోవాలి
» భోగి మంటల్లో ప్రతుల దహనం

రాష్ట్రానికి పట్టిన వైసీపీ పీడ తొలగి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని టీడీపీ శ్రేణులు భోగి మంటలు వేశాయి. సీఎం జగన్ అప్రజాస్వామిక చర్యలు, నిరంకుశ పాలనకు స్వస్తి పలకాలని నాయకులు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు, అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలని సీపీఎం నాయకులు, ప్రజా వ్యతిరేక విధానాలను వీడాలని తెలుగు రైతు విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జీవోల ప్రతులు, ఎస్మా కాగితాలను భోగి మంటల్లో వేసి తగలబెట్టారు.



పత్తికొండలో..



మంత్రాలయంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆదోని: సీఎం జగన్ అప్రజాస్వామిక చర్యలకు, నిరంకుశ పాలనకు స్వస్తి పలకాలని టీడీపీ నాయకులు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఆదోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన భోగి వేడుకల్లో పార్లమెంట్ కార్యదర్శి బుద్దారెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాల్మీకి సభ్యులు అరెకల్లు రామకృష్ణ పాల్గొని ప్రజావ్యతిరేక జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. రాష్ట్ర ఎస్సీ విభాగపు నాయకులు లక్ష్మీనారాయణ, నందమూరి బాలక్రిష్ణ పట్టణ అధ్యక్షుడు సజ్జద్ హుసేన్, బోయ మల్లికార్జున, రామలింగ, ఐసీ రామకృష్ణ, బాబు, వీరేష్, రాముడు, శ్రీరాములు, గోపాల్, చాంద్, మహమ్మద్, మారెన్న, ఖాసీం పాల్గొన్నారు.

● ఆదోనిలో అంగన్‌వాడీలు ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను భోగి మంటల్లో దహనం చేశారు. వారు చేపట్టిన సమ్మె 34వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో రేణుక, కరుణ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నాగేంద్రయ్య డిమాండ్ చేశారు. అదివారం మండల కైరుప్పల, బిల్లేకల్, ముత్తుకూరు, పుష్పాలదొడ్డి, యాటకల్లు గ్రామాల్లో రైతును కలిసి భూహక్కు చట్టం జీవో ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు.

ఆదోని(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ దావీద్, జిల్లా కార్యదర్శి గాది లింగప్ప అన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాల వద్ద యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వ జీవోలను భోగి మంటల్లో దహనం చేశారు. జిల్లా ఆడిట్ కన్వీనర్ శ్రీనివాసులు, యూటీఎఫ్ నాయకులు మల్లయ్య, నర్సయ్య గౌడ్, జనార్ధన్, రాజా, హుసేన్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఇంటిదగ్గర సైకో జగన్ పోవాలి.. సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేస్తూ భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య చౌదరి, కౌన్సిలర్లు దయాసాగర్, రామదాసు గౌడ్, మాజీ కౌన్సిలర్లు మల్లా కలీముల్లా, సుందరరాజు, రామకృష్ణ నాయుడు, కటారి రాజేంద్ర, పరమేష్, నజీర్ పాల్గొన్నారు.

● ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని ఎమ్మిగనూరులోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద భోగి మంటల్లో కరపత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో నాగమణి, ఎల్లప్ప, నరసింహులు, రాఘవేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరులో ఎస్మా నోటీసు ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యునియన్, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో భోగిమంటలు వేసి జీవో 2 ప్రతులను, ఎస్మా నోటీసులను కాల్చివేశారు.

నందవరం: భూహక్కు చట్టంతో రైతులకు అన్యాయం జరుగుతుందని, ప్రతులను నందవరంలో ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు శాంతప్ప, తాయప్ప, రామలింగడు, మునిస్వామి, మల్లేష్, పరశురాముడు, రవి, వెంకటేష్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

గోనెగండ్ల: వైసీపీ ఇచ్చిన హామీ ప్రతులను గోనెగండ్లలో ఆదివారం భోగిమంటల్లో దహనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నాయుడు, నాయకులు మాజీ ఎంపీపీ గాజులదిన్నె హనుమంతు పాల్గొన్నారు.

కౌతాళం: ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను ఆదివారం తెలుగు రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటల్లో దహనం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిందని మండిపడ్డారు.

ఆలూరు: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండి వైఖరిని వీడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద సంక్రాంతి సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను భోగి మంటల్లో దహనం చేశారు. సీపీఎం నాయకులు కేపీ నారాయణ స్వామి, కృష్ణ, షాకీర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో అంగన్‌వాడీలు ఎస్మా ప్రతులను భోగి మంటల్లో కాల్చివేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విశాలక్షి, భీమేశ్వరి, లావణ్య పాల్గొన్నారు.



ఆదోని: భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు



ఎమ్మిగనూరులో..

పత్తికొండ: పత్తికొండ సుంకంగేట వద్ద తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లోకనాథ్ ఆధ్వర్యంలో భోగి మంటల్లో ప్రభుత్వ జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో గుడిసె నరసింహులు, సోమ్లానాయక్, శ్రీనివాసులుగౌడ్, ఉచ్చీరప్ప, సింగం శ్రీను, ఎరుకల చెరువు సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: భూ యాజమాన్య హక్కు చట్టం కబ్జాదారులకే ఉపయోగపడుతుందని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజాసాహెబ్ అన్నారు. ఆదివారం పత్తికొండ పట్టణంతో పాటు పెద్దహుల్తి, నలకదొడ్డి, పందికోన, కొత్తపల్లి గ్రామాల్లో సీపీఐ, రైతుసంఘం నాయకులు భూ యాజమాన్య హక్కు చట్టం జీవో ప్రతులను భోగి మంటలలో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో రామాంజినేయులు, గురుదాసు, కారన్న పాల్గొన్నారు.

వెల్దుర్తి: భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం నాయకులు ఆదివారం ఉదయం వెల్దుర్తి పాతబస్టాండ్‌లో జీవో కాపీలను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మాధవకృష్ణ, మండల అధ్యక్షులు బాలరాజు, పట్టణ కార్యదర్శి గిరి పాల్గొన్నారు.

● పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల అంగన్‌వాడీలు ఆదివారం సమ్మె శిబిరం వద్ద ఎస్మా ప్రతులు, జీవో నెం.2 సమ్మె నోటీసులను భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు.

తుగ్గలి: చీకటి జీవోలు, అక్రమ కేసులతో టీడీపీని అడ్డుకోలేరని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరాముడు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలిలో చీకటి జీవోలను, అక్రమ కేసుల పేపర్లను భోగి మంటలలో వేసి కాల్చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాలునాయుడు, బాలన్న, వెంకటరాముడుచౌదరి, వెంకటస్వామి, లక్ష్మణస్వామియాదవ్, వెంకటరెడ్డి, శ్రీనివాసులుగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.



కేఈ వాళ్లది మచ్చలేని కుటుంబం

మద్దికెర, జనవరి 14: కేఈ వాళ్లది మచ్చలేని కుటుంబమని మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ నాయకులు ఉప్పరి రంగయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజినేయులు, మండల ఎస్సీ సెల్ నాయకుడు పారా విరోభలు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ 2017లో వైసీపీ నాయకుడు చెరుకులపాడు నారాయణరెడ్డి ప్రత్యర్థులు హత్యచేస్తే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు పేరును కావాలని ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయించారన్నారు. కేఈ శ్యాంబాబుకు ఈ హత్య కేసులో ఎటువంటి సంబంధం లేదని ఈనెల 13న కర్నూలు కోర్టులో కొట్టివేశారన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న అధికారి: సీపీఐ

ఎమ్మిగనూరు, జనవరి 14: మండలంలోని గ్రామాల అభివృద్ధికిపాటు పడకుండా పంచాయతీరాజ్ ఏఈ శంకర్ అక్రమాలకు పాల్పడుతున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. ఆదివారం సీపీఐ కార్యాలయం దగ్గర భోగిమంటల్లో ఏఈ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగన్న, సీనియర్ నాయకులు బజారి, తిమ్మగురుడు, జబ్బార్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకుండా ఏఈ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.



ఘనంగా భోగి

ఎమ్మిగనూరు, జనవరి 14: భోగి పండుగను పట్టణ, ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని గాంధీనగర్, వీవర్స్‌కాలనీ, హెచ్‌బీఎస్ కాలనీ, లక్ష్మీపేట, మునెప్పనగర్, ముగతిపేట, ఎస్ఎంటీకాలనీ ప్రాంతా ల్లో మహిళలు వేకువజామునే ఇళ్ల ముందు పేడ నీళ్లతో కల్లాపుచల్లి రంగులతో వివిధ రకాల ముగ్గులను వేసి గొబ్బెమ్మలు, ఎర్రగడ్డ, పూలు ఉంచి పూజలు నిర్వహించారు. భోగి మంటలను వేసి పండుగను జరుపుకున్నారు. పట్టణంలోని ఆయా ప్రాంతాలతోపాటు గాంధీనగర్, రాజేశ్వరీ హోటల్ ప్రాతంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వైపీఎం కొండయ్యచౌదరి ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి పండుగను నిర్వహించారు. సోమవారం జరిగే సంక్రాంతి పండుగను పురస్క రించుకుని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే మండల పరిధిలోని సోగనూరు, తిమ్మాపురం, కోటేకల్, బోడబండ,సిరాలదొడ్డి, కడిమెట్ల, రాళ్లదొడ్డి, డైవందిన్నె, కలుగొట్ల, ఏనుగుబాల గ్రామాల్లో ఆదివారం భోగి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

కౌతాళం: మండలంలోని రాజనగర్ క్యాంపు, కుంబళనూరు క్యాంపు, చూడి క్యాంపులలోభోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు రాజానగర్ క్యాంపులో స్వగృహంలో బంధువులు, పిల్లలతో కలసి భోగి మంటలు వేసి పండుగను జరుపుకున్నారు.

తుగ్గలి: మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు ముగ్గులను వేశారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం.. కారు సీజ్

ఎమ్మిగనూరు, జనవరి 14: మంత్రాలయం మండలం బూదూరు గ్రామ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎమ్మిగనూరు సెబ్ సీఐ జయరామ్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఆదివారం పట్టణంలోని సెబ్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సెబ్ సీఐ జయరామ్ నాయక్ మాట్లాడుతూ కర్ణాటక నుంచి గ్రీన్‌కలర్‌లో ఉన్న టవేరా కారులో 28 బాక్సుల్లో కర్ణాటక మద్యం బాక్సులను తరలిసుండగా అందిన సమాచారంతో బూదూరు సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. కారు డ్రైవర్ కారును వదలి పారిపోయాడని తెలిపారు. 28 బాక్సుల్లో 2,688 కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లు ఉన్నట్లు తెలిపారు. వీటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందన్నారు. మద్యం, వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆదోని రూరల్: ఆదోని మండలం కడితోట గ్రామ సమీపంలో పోలీసులను చూసి కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంతోపాటు మద్యం బాక్సు లను వదిలేసి పరారయ్యారు. వాహనాల తనిఖీల్లో భాగంగా తమ సిబ్బంది కడితోట క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు 10 మద్యం బాక్సులు, ద్విచక్ర వాహనాన్ని వదిలి పారిపోయారని పెద్దతుంబళం ఎస్ఐ పీరయ్య తెలిపారు. నిందితులు ఆదోని బోయగేరికి చెందిన సిసింద్రి, విజయ్‌లుగా గుర్తించామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నందవరం: మండలలోఓని నాగలదిన్నె బ్రిడ్జి ద్గర కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. అదివారం ఆయన మాట్లాడుతూ నాగలదిన్నె చెక్‌పోస్టు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయచోటి గ్రామానికి చెందిన రామాంజినేయులు సంచిలో కర్ణాటక వద్యాన్ని తీసుకెళ్తూ పట్టుబడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



వెండి రథంపై ఊరేగిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 14: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సంక్రాంతి భోగి పండగ శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

ఆదోని టౌన్, జనవరి 14: మణిపూర్ నుంచి ముంబై వరకు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్రకు మద్దతుగా పార్టీ జిల్లా నాయకుడు దేవి శెట్టి ప్రకాష్, జిల్లా మైనారిటీ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు ఎంఎంనూర్ అహమ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రధాన వీధుల్లో పాదయాత్రను చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాహుల్‌గాంధీ చేపట్టిన ఈ యాత్ర విజయవంతం కావాలన్నారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తాయన్న, జిల్లా మైనారిటీ కార్యదర్శి మహమ్మద్, పట్టణ మైనారిటీ అధ్యక్షుడు రఫీక్ అహ్మద్, మండల అధ్యక్షుడు కుప్పగల్ అయ్యప్ప పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంత్రాలయం, జనవరి 14: మండలంలోని చెట్నహల్లి గ్రామ సమీపంలో పేకాటాడుతున్న ఏడుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. మంత్రాలయానికి చెందిన నలుగురు, మాధవరానికి చెందిన ఇద్దరు, చెట్నహల్లికి చెందిన ఒకరిని అరెస్టు చేసి రూ.3,140లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆదోని: ఆదోని పట్టణంలోని మైనారిటీ కాలనీ సమీపంలోని పేకాట స్థావరంపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ తేజమూర్తి ఆదివారం దాడులు జరిపారు. 12 మంది ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడులు వారిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.53,370 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తేజమూర్తి, ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపారు.